క్లుప్తంగా

పదడుగుల కొండ చిలువ హతం




మంగొల్లు(వత్సవాయి): పది అడుగుల కొండ చిలువను చంపిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మంగొల్లు నుంచి గండ్రాయి వెళ్లే రహదారి పక్కన ఉన్న సుబాబుల్ తోటలో నుంచి కొండచిలువ బయటకు వచ్చింది. రహదారి అవతల నుంచి ఇవతలకు దాటటాన్ని గమనించిన కొందరు గ్రామస్తులు, వెంటనే అప్రమత్తమై చుట్టుపక్కల వాళ్లను కేకలు వేసి పిలిచారు. అందరూ కలిసి కొండచిలువను గొడ్డళ్లు, రాళ్లతో కొట్టి చంపారు. ఈ కొండ చిలువ పది అడుగుల మేర పొడవు దాదాపు 40 కేజీల వరకు బరువు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పెనుగంచిప్రోలు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మండల కేంద్రం పెనుగంచిప్రోలు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎండీ జిలాని, జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి సుధానంద్, నాయకులు పాము నాగేశ్వరరావు, బి.లింగయ్య, షేక్ జాని, శ్రీనివాసరావు, మధు, పాకాలపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద



జగ్గయ్యపేట: ఐదు రోజులుగా ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండటంతో దిగువకు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 15 గేట్ల ద్వారా వరద నీరు దిగువకు వస్తోంది. మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలైన వేదాద్రి, రావిరాల, ముక్త్యాల గ్రామాల్లో వరద నీటి ఉధృతి కొనసాగుతోంది.

ప్రతిఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని పిలుపు

జగ్గయ్యపేట అర్బన్: ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈనెల 13వతేదీ నుంచి 15వతేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేసి, దేశ గౌరవాన్ని చాటిచెబుదామని బీజేపీ నాయకులు శనివారం జగ్గయ్యపేట ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు కీసర రాంబాబు, ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గం కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపాగ శ్రీకాంత్ మాట్లాడుతూ కుటుంబసమేతంగా ఇంటిపై జాతీయజెండాను ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను భావితరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ బొడ్డు మల్లికార్జునరావు, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కల్లూరు శ్రీవాణి, పేట పట్టణ అధ్యక్షుడు గోలి రాఘవేంద్రరావు, పేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల అధ్యక్షులు చేవూరి చారి, పాపినేని వీరబాబు, అప్పారావు, కోవెలమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకపక్షంగా బుక్‌కీపర్ల తొలగింపు

- ఆందోళనలో చిరుద్యోగులు
- రోడ్డునపడ్డామని ఆవేదన
- అధికారపార్టీ నేతల తీరుపై సర్వత్రా విస్మయం

వీరులపాడు: డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఆయా గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న బుక్‌కీపర్లు(వీవోఏ)లను ఎటువంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగిస్తుండటంతో వీవోఏల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. కేవలం వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులనే కారణంతో వీవోఏలను తొలగిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

32మంది వీవోఏల తొలగింపు..

వీరులపాడు మండలంలోని 22 గ్రామ పంచాయతీలు ఉండగా, 40మంది బుక్ కీపర్‌లు (వీవోఏ) పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.8000లను గౌరవవేతనంగా ఇస్తుండగా, ఆయా గ్రామ సమైక్య సంఘాల నుంచి రూ.2వేలు కలిపి మొత్తం రూ.10వేలు అందుతుంది. వీరు ఆయా గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులకు, బ్యాంకులతో మాట్లాడి రుణాలు అందేలా చూస్తారు. ఆయా రుణాలను డ్వాక్రా సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించేలా పనిచేస్తారు. ఇలా గ్రామంలోనే ఉండి వచ్చే కొద్దిపాటి గౌరవవేతనంతో పనిచేస్తున్న చిరుద్యోగులపై అధికార టీడీపీ నేతలు తమ జులుం ప్రదర్శిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న కొందరు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో ఏపీఎంపై ఒత్తిడి తెచ్చి వీవోఏలను విధుల నుంచి ఏకపక్షంగా తొలగింపజేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు వీరులపాడు మండలంలో 32మంది వీవోఏలను తొలగించడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇలా నందిగామ నియోజకవర్గ వ్యాప్తం 120మందిని విధుల నుంచి తొలగించారు. తొలగించిన వీవోఏల స్థానంలో టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారి పేర్లను నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటం గమనార్హం. తమ పనిలో ఎటువంటి పొరపాట్లు లేనప్పటికీ, కేవలం గత ప్రభుత్వంలో పనిచేశామనే కారణంతో విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సబబు అని బాధిత వీవోఏలు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ఏపీఎంను అడిగితే కనీసం సమాధానం కూడా ఇవ్వడం లేదని వీవోఏలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



గ్రామైక్య సంఘాల సమావేశంలో పాల్గొన్న వీవోఏలు (ఫైల్)



రోడ్డుప్రమాదంలో గాయపడిన వీవోఏ నిర్మలను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వీవోఏకు తీవ్రగాయాలు..

మండలంలోని జగన్నాధపురంలో మెరుగుమాల నిర్మల కొన్నేళ్లుగా బుక్‌కీపర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి సమాచారం లేకుండా ఆమెను విధుల నుంచి తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న నిర్మల ఏపీఎంను వివరణ కోరేందుకు ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో నిర్మలకు కాలు విరగడంతో వైద్యం చేయించుకుని ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉన్న ఉపాధి దెబ్బతినడమేగాక, విధుల తొలగింపు కారణంగా ప్రమాదానికి కూడా గురయ్యాయని నిర్మల ఆవేదన వ్యక్తంచేస్తోంది. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు లాల్ అహ్మద్ గౌస్, మంగళాపూడి సుందరరావు తదితరులు జగన్నాధపురం వెళ్లి బాధితురాలు నిర్మలను పరామర్శించారు. విధుల నుంచి తొలగించిన వీవోఏలను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రాష్ట్రప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. విధుల నుంచి తొలగింపునకు గురైన వీవోఏల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పదేళ్లుగా పనిచేస్తుంటే తొలగించారు...



నేను పొన్నవరం వీవోఏగా గత పదేళ్లుగా పనిచేస్తున్నాను. ఇటీవల జరిగిన ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో నేను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలిననే సాకుతో విధుల నుంచి తొలగించారు. కనీసం ఎందుకు తొలగిస్తున్నారో కూడా సమాచారం ఇవ్వలేదు.

– సుమలత, పొన్నవరం

నా బిడ్డల పరిస్థితేంటి...



నేను జగన్నాధపురం వీవోఏగా పని చేస్తున్నాను. నాకు ఇద్దరు కుమార్తెలు న్నారు. వీవోఏగా వచ్చే వేతనంతోనే నా కుటుంబ పోషణ సాగుతుంది. నన్ను అకారణంగా తొలగించారు. నా బిడ్డల చదువు, కుటుంబపోషణ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

– నిర్మల, జగన్నాధపురం

చిరుద్యోగుల తొలగింపు తగదు...



రాజకీయ కారణాలతో చిరుద్యోగులను తొలగిస్తే సహించేది లేదు. నందిగామ నియోజకవర్గంలో ఇప్పటివరకు 120మంది వీవోఏలను తొలగించారు. పలువురు వీవోఏలకు వైఎస్సార్ సీపీ అని ముద్ర వేసి వారిని తొలగించడం దుర్మార్గ చర్య. తొలగించిన వారిని తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తాం.

– చాంద్‌బేగం, ఐద్వా నాయకురాలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



నందిగామలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు

మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: దేశంలోని అన్నిరాష్ట్రాల్లో భారత రాజ్యాంగం అమలవుతుంటే, మనరాష్ట్రంలో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. భారత రాజ్యాంగనిర్మాత, దేశానికి దిశదశ చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై విజయవాడలో పచ్చమూకలు జరిపిన దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి నందిగామలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ తీరును నిరసించడంతోపాటు అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే జగన్ మోహనరావు నివాసం నుంచి గాంధీసెంటర్ మీదుగా రథం సెంటర్ వరకు సాగింది. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై దాడికి పాల్పడటం హేయమైన చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఈవీఎం ప్రభుత్వం..

రాష్ట్రంలో నడుస్తున్నది ఈవీఎం ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. ఈ అంటే ఎన్‌ట్రాప్‌మెంట్ (ఉచ్చువేయటం, మోసగించడం), వి అంటే వయలెన్స్, ఎం అంటే మేనేజ్‌మెంట్, మనీ ఎర్నింగ్ అని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3వేలు, 18ఏళ్లు నిండి మహిళలకు నెలకు రూ.1500, 50ఏళ్లకే పింఛన్ ఇస్తానంటూ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ప్రజలను ఉచ్చులోకి లాగారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. నందిగామలో సైతం మోకాళ్లపై నిల్చోబెట్టిన ఘటనను చూశామని గుర్తుచేశారు. అంబేడ్కర్ విగ్రహం మీద దాడి చేయలేదు.. అక్కడున్న మాజీ ముఖ్యమంత్రి పేరు తొలగించామంటూ పచ్చమూకలు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాయని విమర్శించారు.



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

దీటైనా జవాబు చెబుతాం..

రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతున్నా అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవహస్తున్న తీరుకు రానున్న కాలంలో దీటైన సమాధానం చెబుతామని జగన్‌మోహనరావు హెచ్చరించారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిన వ్యవహరిస్తే వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎందాకైనా వెళ్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్రాభివృద్ధికి ప్రజల బాగోగులకు వైఎస్సార్ సీపీ, ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కరిస్టులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా టీడీపీ కూటమి ప్రభుత్వం తనతీరు మార్చుకుని ప్రజాస్వామ్య పాలన అందించాలని ఆయన హితవు పలికారు. కొవ్వొత్తుల ర్యాలీలో వైఎస్సార్ సీపీ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మంచాల చంద్రశేఖర్, వేమా సురేష్‌బాబు, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు బండి మల్లికార్జునరావు, కన్నెగంటి జీవరత్నం, కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, వేల్పుల రమేష్, బుడ్డి సత్యనారాయణ, కొమ్ము విజయరాజు, నాయుడు ఉదయలక్ష్మి, గుడేటి శ్రీను, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కరిస్టులు పాల్గొన్నారు.

15న అన్నా క్యాంటీన్ ప్రారంభం

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 15వ తేదీన జగ్గయ్యపేట పట్టణంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. విజయవాడ రోడ్‌లోని కమలా సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న అన్నా క్యాంటీన్‌ను స్థానిక కూటమి నాయకులతో కలసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన 24గంటల్లోనే చరిత్రలో నిలిచిపోయేలా ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారని, అందులో అన్నా క్యాంటీన్ పునః ప్రారంభం ఒకటి కావడం హర్షణీయమన్నారు. అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి 15వ తేదీన ప్రారంభించి పేదలకు అన్నదానం చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, మాజీ కౌన్సిలర్లు కటికల అనిల్, కొరకూటి సైదులు, కర్ల జోజి, కావేటి కృష్ణ తదితరులు ఉన్నారు.



అన్నా క్యాంటీన్ వద్ద నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేయడం ద్వారా గ్రామపంచాయతీలు ఆదాయాన్ని పెంచుకోవచ్చని ఈవోపీఆర్డీ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం కూడా కొనసాగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం శుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య నిర్వహణతోపాటు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్వహణ సమర్థవంతంగా ఉండాలన్నారు. ప్రతి పంచాయతీలో 1000 మంది జనాభాకు ఒక క్లాప్‌మిత్రను ఏర్పాటు చేసుకుని గ్రామంలో చెత్తను రిక్షాల ద్వారా సేకరించాలన్నారు. చెత్త సేకరణలో ప్రజలను కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు వేల్పుల పద్మకుమారి, గోనెల దేవి, ఏట సిద్దారెడ్డి, ఎస్‌జీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ ప్రసాద్, పక్కన ఏటి సిద్దారెడ్డి తదితరులు

గ్రామాభివృద్ధిపై పట్టు సాధించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామ సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిపై పట్టు సాధించాలని ఎంపీడీవో రమేష్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త నిర్వహణపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు రెండోరోజు శనివారం కూడా కొనసాగాయి. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను సర్పంచ్‌లు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ఖర్చుచేసి గ్రామాభివృద్ధి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సాంబశివరావు, ట్రైనర్లు శ్రీనివాసరావు, రాజు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌బాబు

ముగ్గురికి గాయాలు

నందిగామ టౌన్: పిచ్చికుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన మండలంలోని సోమవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సునీత, రాజ్‌కుమార్, వెంకట నరసమ్మలపై పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. వారికి గోళ్లమూడి పీహెచ్‌సీలో వైద్యాధికారి రాణి వైద్య చికిత్స చేసి వ్యాక్సిన్ అందించారు. గ్రామంలో కొద్దిరోజులుగా పిచ్చికుక్క తిరుగుతుందని చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినప్పటికీ కనీసం పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌ఎంసీ సభ్యులకు ఘనసత్కారం



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల ధర్మవరప్పాడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులను మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అభినందించారు. ధర్మవరప్పాడు ఎంపీయూపీ స్కూల్ చైర్‌పర్సన్ ధరావత్‌రోజా, వైస్ చైర్మన్ మూడావత్ ప్రసాద్, కమిటీ సభ్యులు శనివారం ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉదయభాను వారిని దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలి

కంచికచర్ల : గ్రామ సర్పంచులు, కార్యదర్శులు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనర్ రామసీత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, తడిపొడి చెత్తపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండోరోజు శనివారం కూడా కొనసాగాయి. శిక్షణ అనంతరం కంచికచర్ల గ్రామస్తులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని ప్రజలకు వివరించారు. ఈ చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారీ చేసుకుని పంచాయతీలకు ఆదాయం పెంచుకునే విధానాన్ని సర్పంచులు, కార్యదర్శులకు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీడీవో శివపార్వతి సూచించారు. జుజ్జూరులోని ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారం కూడా కొనసాగాయి. అనంతరం మండలంలోని పొన్నవరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచ్ షోడగిరి రాజేశ్వరి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి..

నందిగామ టౌన్: వచ్చే అక్టోబర్ 2వతేదీన నిర్వహించనున్న గాంధీ జయంతి నాటికి మండలంలోని సంపద సృష్టి కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో విశ్వనాథ్, ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు సూచించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని వనరులను వినియోగించుకుని గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం లింగాలపాడులోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కంచికచర్ల పంచాయతీ సిబ్బంది, ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామసీత



లింగాలపాడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్ తదితరులు

అధిక వర్షాలకు ఎర్రబడిన పత్తి చేలు

పెనుగంచిప్రోలు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తిచేలల్లో నీరు నిలిచిపోయి బురద మయంగా మారుతున్నాయి. నియోజకవర్గంలో ఈఏడాది 20వేల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేపట్టారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో ముఖ్యంగా పల్లంగా ఉన్న వందలాది ఎకరాల్లో వర్షపునీరు ఇంకా నిలిచే ఉంది. నీరు ఎటుపోయే మార్గం లేకపోవడంతో రోజులతరబడి పత్తిచేను వర్షపు నీటిలో నానుతూనే ఉంది. దీంతో మొక్కలు ఎర్రబడి కుళ్లిపోతున్నాయి. ఏమాత్రం తెరిపి ఇచ్చినా ఏదోవిధంగా పత్తిచేనులో ఉన్న నీటిని బయటికి పంపించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తుండగా, వర్షాలు మాత్రం తెరిపి ఇవ్వడం లేదు. శనివారం ఉదయం కూడా వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐదురోజులుగా పత్తిచేనులోని వర్షపు నీరు బయటికి వెళ్లే మార్గంలేక పత్తి మొక్కలు ఎర్రబడిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాగు మొదటిలోనే తమను ప్రకృతి తీవ్రంగా నష్టపరుస్తోందని వాపోతున్నారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలు శుక్రవారం కొద్దిమేర తెరిపి ఇచ్చినప్పటికీ శనివారం తిరిగి వర్షం కురవడంతో పత్తి పొలాల్లో నీరు అలాగే నిలిచి ఉంది. దీంతో ఆకులు ఎర్రబడి మొక్కలన్నీ ఎర్రగా మారి ఎండి పోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనికితోడు పంట కంటే అధికంగా కలుపు విపరీతంగా పెరుగుతుండటం రైతులను కలవరపరుస్తోంది.



మక్కపేట సమీపంలో ఎర్రబడిన పత్తి చేను



పెనుగంచిప్రోలు వద్ద పత్తిలో ఏపుగా పెరిగిన కలుపుమొక్కలు

గుంతను పూడ్చిన పోలీసులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లే రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడి అత్యంత ప్రమాదకరంగా మారింది. 10అడుగుల వెడల్పున ఏర్పడిన గుంతలో తరచూ వాహనాదారులు పడుతూ గాయపడుతున్నారు. దీంతో శనివారం పెనుగంచిప్రోలు ఏఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ కలిసి స్థానికుల సాయంతో కంకర, మట్టితో ఆగుంతను పూడ్చి చదును చేశారు. పోలీసులు స్పందనపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంతను చదును చేస్తున్న ఏఎస్ఐ శంకర్, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్

మహిళా కౌలురైతు ఆత్మహత్య

కంచికచర్ల : వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేమని మనస్తాపం చెందిన ఓ మహిళా రైతు పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంచికచర్ల మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు వేములపల్లి గ్రామానికి చెందిన గుడిశె ఉషారాణి(38) కొన్నేళ్లుగా పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తోంది. మూడేళ్ల నుంచి సాగుచేసిన పంటలు ఆశించినమేర దిగుబడిరాక చేసిన అప్పులు వడ్డీలు కలిపి రూ.3లక్షలు చెల్లించలేకపోయింది. దీంతో మనస్తాపం చెంది పొలంలో పురుగుమందు తాగింది. గమనించిన తోటి రైతులు ఆమెను చూసి వెంటనే వైద్యచికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన మహిళారైతు ఉషారాణి